క్లుప్తంగా

20న సామాజిక తనిఖీ ప్రజావేదిక

మానవపాడు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈ నెల 20న, బుధవారం ఉదయం 10.00గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉంటుందని ఎంపీడీఓ భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 1 ఏప్రిల్ 2023 నుంచి మార్చి31, 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు, తనిఖీ నిర్వహించి తుది నివేదిక సమర్పిస్తారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే డీకే సత్యారెడ్డికి ఘన నివాళి



గద్వాలటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసన సభ్యుడు డీకే సత్యారెడ్డి వర్ధంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో ఉన్న డీకే సత్యారెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ఆయన సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా డీకే సత్యారెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం డీకే బంగ్లాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, జనార్దన్‌రెడ్డి, నర్సన్‌దొడ్డి క్రిష్ణారెడ్డి, సందీప్, అశోక్ పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి జరిమానా

శాంతినగర్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు మేపినందుకు గొర్రెల కాపరికి జరిమానా వేసినట్లు మున్సిపల్ కార్యాలయ అధికారులు తెలిపారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల మధ్యలో పాలెం గ్రామం, కొత్తకోట మండలానికి చెందిన రమేష్ అనే గొర్రెల కాపరి తన గొర్రెలను తోలుకొని వెళ్లడమే గాక చెట్లను మేపినందుకు గాను కమిషనర్ రాజయ్య ఆదేశాల మేరకు రూ.500 జరిమానా విధించినట్లు వివరించారు. ఇకపై మున్సిపాలిటీలో మొక్కలను మేపినా, తొలగించినా జరిమానాతో పాటు మున్సిపల్ చట్టం ప్రకారం బాధ్యులు కావాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజోళి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌కు మరమ్మతు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ తెలిపారు. రాజోళి-2 ఎంహెచ్‌క్యూ ఫీడర్‌లో మరమ్మతు చేయడంతో పాటు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజోళితో పాటు తుమ్మలపల్లి, తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పిల్లలతో పనిచేయిస్తే చర్యలు



కేటీ దొడ్డి: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, వారితో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎంఈఓ వేంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని రంగాపురం, మైలగడ్డ గ్రామంలో చైల్డ్‌లేబర్ అధికారులతో కలిసి బడిబయటి పిల్లలను బడిలో చేర్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సమావేశం నిర్వహించి సలహాలు ఇచ్చారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు

రాజోళి: మండల కేంద్రంలో కొలువైన కుంభేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమాలు, ప్రత్యేక కార్యక్రమాలు, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



నేటి నుంచి భవానీమాత ఉత్సవాలు



గట్టులోని శ్రీ అంబాభవాని ఆలయం



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

గట్టు: మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీ అంబాభవానీ మాత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. జాతరకు సంబంధిచి ఏర్పాట్లను క్షత్రియ సంఘం వారు పూర్తి చేశారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో నిర్వహించే ఈ ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. గట్టు జాతర నాటికి వానాకాలం పంటలు రైతుల చేతికందుతాయి. దీంతో రైతులు ఈ జాతరను ఎంతో ఉత్సాహంతో వైభవంగా నిర్వహిస్తారు. జాతర సందర్భంగా గట్టు బంధువులతో కిటకిటలాడుతుంది. ఈ ప్రాంతానికి చెందిన క్షత్రియులు(ఖత్రి)ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లి, అక్కడే స్థిరపడిన వారు సైతం కుటుంబంతో సహా జాతరకు వచ్చి తమ ఇంటి దేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు క్షత్రియ సంఘం అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం నాయకులు పాపురం వెంకటేష్, సూపర్ పటేల్ వీరన్న, చంద్రమోహన్ తదితరులు తెలిపారు.

జాతర కార్యక్రమాలు

జాతర సందర్భంగా మంగళవారం ఉదయం 8గంటలకు ఆలయం ఎదుట పందిరి పూజ, రాత్రి 9గంటలకు ప్రభోత్సవం ఉంటుంది. బుధవారం ఉదయం 10 గంటలకు కలశ పూజ, 11గంటలకు బిందె సేవ కార్యక్రమం ఉంటుంది. అనంతరం జాతరకు వచ్చే భక్తులకు కొడుమూరుకు చెందిన దాత బసోది వెంకటేశ్వర్లు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు ప్రత్యేకంగా అలంకరించబడిన అమ్మవారి రథోత్సవం చేస్తారు. కార్తీక బహుళ గురువారం రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో గ్రామంలో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలను అందించి ఆమె అనుగ్రహం పొందుతారు. శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు ఆలయం పక్కనే ఉన్న పురాతన కాలం నాటి శేషం బావిలో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించడంతో ఉత్సవాలు ముగుస్తాయి. జాతరను నిర్వహించే సంత బజారులో ఇప్పటికే వివిధ దుకాణ సముదాయాలు వెలిశాయి.

కంపెనీపై చర్యలు తీసుకోవాలి

అలంపూర్: కాలుష్యం వెదజల్లుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కర్నూల్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కు కొండేరు, జింకలపల్లి, షేక్‌పల్లి గ్రామాల ప్రజలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామ సమీపంలో ఉన్న ఓ కంపెనీ నుంచి విషపూరితమైన కాలుష్యం వెదజల్లుతున్నట్లు పేర్కొన్నారు. కంపెనీని శాశ్వతంగా మూసివేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సత్యారెడ్డి, మాజీ సర్పంచ్ ఈదన్న, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, వీరబాబు, శేషు, నారాయణ, బోయ మద్దిలేటి, శివ, గోవిందు, చిన్న మద్దిలేటి తదితరులు ఉన్నారు.

జోగులాంబ ఆలయ మాజీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ



అలంపూర్: శ్రీజోగుళాంబ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బడుగుల తిరుపతిరెడ్డి కుటుంబాన్ని రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. ఈ నెల 17వ తేదీన అనారోగ్యంతో శ్రీజోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బడుగుల తిరుపతిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. తన స్వగ్రామమైన ఉండవెల్లి మండలం కలుగోట్లలో సోమవారం అంత్యక్రియలు ముగిశాయి. ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతిరెడ్డి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ ఐజీ బడుగుల సుమతి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన సమయంలో ఐజీ సుమతి భావోద్వేగానికి లోనయ్యారు. ఎమ్మెల్సీ ఆమెను ఓదార్చారు. డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ భద్రతను పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మాచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు వెంకటేష్

గట్టు: మండలంలోని మాచర్ల, పెంచికలపాడు గ్రామాల్లో సోమవారం ఆయా గ్రామాల రైతులతో కలిసి పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. సన్న రకం ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,320తో పాటుగా అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు వడ్లను ఆరబెట్టుకుని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఏఈఓ జారీ చేసిన పంట ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అలీ, సురేష్, నీలకంఠం, రాజుగౌడ్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, ఊసేని, నరేందర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం కుర్మయ్య, ఏఈఓ ప్రవళిక, నాయకులు సోమనాద్రి, రుక్మేందర్‌రెడ్డి, అల్లబకాష్, యోహన్ తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



ఇటిక్యాలలో మాట్లాడుతున్న ఏపీఎం కుర్మయ్య

ధరూరు: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా మండల మహిళా సమాఖ్య పని చేస్తోందని ఐకేపీ ఏపీఎం శోభారాణి అన్నారు. మహిళా సమాఖ్య వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మండల ఐకేపీ సిబ్బంది, సమాఖ్య సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలను గుర్తించి వారిని సంఘంలో చేర్పించడంతో పాటు వారికి ఇన్సురెన్స్, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి రుణాలు ఇవ్వడం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీసీలు జయరాజ్, నవీన్, శేఖర్, రాఘువేంద్ర, రాములు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలో ఏపీఎం భీమన్న ఆధ్వర్యంలో సోమవారం మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణబీమా పథకం, ఇందిర మహిళా శక్తి కార్యక్రమం, ప్రమాద బీమా పథకం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యూనిఫాం కుట్టడం, డ్వాక్రా బజార్ ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమం, వడ్డీలేని రుణాలు అందించి ప్రభుత్వం మహిళలను ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు మహ్మద్ భాషా, వెంకటేష్, సుజాతమ్మ, కవితమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మహిళా సమాఖ్య భవనంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులతో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకళ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి వచ్చే నెల 15 వరకు మహిళా సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎం సాంబశివుడు, ఏపీఓ స్వామి, సీసీ జయకర్, రామకృష్ణ, ఆంజనేయులు, జ్యోతి, సుదర్శన్, శివకుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: ఎస్ఈఆర్పీ, డీఆర్‌డీఏ ఆదేశానుసారం పట్టణంలోని సమైఖ్య భవణంలో మహిళా సంఘాల సభ్యులకు కొత్త యూనిట్లపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మహిళా శక్తి పథకానికి సంబంధించి నాటుకోళ్ల పెంపకం, మదర్ యూనిట్ (కోడి గుడ్డు ద్వారా పిల్లల తయారీ), మొబైల్ క్యాంటీన్, పిండి, కారం గిర్ని, పాడి ఆవులు, గేదెలపై మహిళా సంఘాల వారికి అవగాహన కల్పించారు.

ఇటిక్యాల: మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య కార్యాలయంలో సోమవారం మహిళా ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం కురుమయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సంఘంలో లేనటువంటి మహిళలను సంఘంలో చేర్పి ప్రతి సభ్యురాలికి రుణ బీమా పథకం, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. 154 సంఘాలకి రెండో విడత వడ్డీ లేని రుణాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మమ్మ, సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.



గట్టులో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలు



ధరూరులో..

ఇంగ్లిష్ అభ్యాసన సామర్థ్యం పెంపొందించాలి



మానవపాడు: ఆంగ్లంలో విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని పెద్దఆముదాలపాడులో పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్య బోధనను చేయాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు.

కస్తూర్బా పాఠశాలకు విరాళం



మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు సోమవారం మల్దకల్ మాజీ జెడ్పీటీసీ అమరవాయి మురళీధర్‌రెడ్డి రూ.15వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాఠశాలలో వంట గది, కిటికీల మరమ్మతుకు గాను నగదును అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, లక్ష్మన్న, విజయలక్ష్మి, అశ్విని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు పరీక్షలు

గద్వాల అర్బన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో డ్రాగన్ షోటోకాన్ కరాటే స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో మాస్టర్ ఆర్బత్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి 50మంది విద్యార్థులు బెల్టు టెస్టులో పాల్గొనగా.. అక్షయ్, జగ్గలి, విజయ్, నరసింహ, ప్రశాంత్, ఎండీ అబ్బుజర్ బ్లాక్ బెల్టు సాధించినట్లు సోమవారం మాస్టర్ ఆర్బత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి వ్యవస్థాపకులు షాలం బిన్ ఉమర్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్ అభినందించారు.

ఉన్నతంగా రాణించాలి

గట్టు: విద్యార్థులు మంచి సంకల్పంతోనే ముందుకు సాగి, భవిష్యత్‌లో ఉన్నత స్థితికి చేరుకోవాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. సోమవారం నీట్‌లో ర్యాంకు సాధించి, వైద్య విద్యను అభ్యసిస్తున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన కుమార్‌ను మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ సన్మానించారు.

ఈశ్వరన్న స్ఫూర్తితో భూ పోరాటాలు



ఈశ్వరన్నకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: సీపీఎం ఉమ్మడి జిల్లా కార్యదర్శి వనగంటి ఈశ్వరన్న స్ఫూర్తితో భూ పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో వనగంటి ఈశ్వరన్న నాల్గో వర్ధంతిని పురస్కరించుకొని వనగంటి ఈశ్వరన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలకు భూములు, ఇళ్ల స్థలాల కోసం నిరంతరం పోరాటాలు చేసిన వ్యక్తి వనగంటి ఈశ్వరన్న అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు వీవీ నర్సింహ, పరంజ్యోతి, విజయ్ కుమార్, ప్రభుదాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక



జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన చింటు

ధరూరు: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ధరూరుకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6న మహబూబ్‌నగర్‌లో జరిగిన రగ్బీ సెలక్షన్స్‌లో అండర్-17 విభాగంలో గద్వాల జిల్లా తరపున ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి చింటు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా మేడ్చల్ కేఎల్‌ఆర్ గ్రౌండ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 రాష్ట్ర రగ్బీ పోటీల్లో చింటు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాఘవేంద్ర తెలిపారు. డిసెంబర్‌లో బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టండి



మాట్లాడుతున్న భగత్‌రెడ్డి

అయిజ: మున్సిపాలిటీలో అనేక సమస్యలు తిష్టవేశాయని, సమస్యలన్నింటినీ పరిష్కరించాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని వార్డుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలో రెగ్యూలర్ కమిషనర్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో కోనోకార్పస్ చెట్లను తొలగించకపోవడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. సమస్యలను పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు.

పప్పుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన 125 మంది రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం 2024-25 కింద పప్పు ధాన్యాల పంటలను ప్రోత్సహించేందుకు పప్పుశనగ పంట విత్తన రకం ఎన్‌బీఈజీ-49 మినీ కిట్లను వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ రకం పంటకాలం 90 నుంచి 105 రోజులు ఉండి, ఎండుకుళ్లు, వేరు కుళ్లు తెగుళ్లను తట్టుకొని సరాసరి ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందన్నారు. పంట కోసిన తరువాత ఈ రకం దిగుబడి అంచనాలను పరిశోధన స్థానాలకు నివేదిస్తామన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



తాటికుంటలో సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ


మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం తాటికుంట, నాగర్‌దొడ్డి, విఠలాపురం, మల్దకల్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ముందుగా ఆయా గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేకు వెళ్లే ముందు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు గ్రామ ప్రజలు పూర్తి వివరాలను ఇవ్వడంతో పాటు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణపై అవగాహన



మల్దకల్: మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, మహిళా సమాఖ్య, ఉపాధి హామీ, స్థానిక పోలీసుస్టేషన్‌లో అధికారులు నిర్వహించే విధులు, బాధ్యతలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలోని వివిధ కార్యాలయాల్లో అధికారుల విధి నిర్వహణపై అవగాహన కల్పించినట్లు ప్రధానోపాధ్యాయుడు నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం సినీ హీరో రాంచరణ్ అభిమాని స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. క్లిన్‌కార కొణిదెల హెల్పింగ్ హాండ్స్ సభ్యురాలు సంధ్యాజయరాజ్ వందమంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లను అందజేశారు. హ్యాపీ లివింగ్స్ గ్రూప్స్ అధినేత శ్రీనుబాబు కూడా స్కూల్‌బ్యాగ్‌ల కోసం సాయం అందించినట్లు జయరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యోగీశ్వర్, ఉపాధ్యాయులు శశికాంత్ రెడ్డి, సతీష్‌కుమార్, రంగస్వామి, శ్రీలత, గ్రామస్తులు శాంతిరాజ్, డేవిడ్, మేకల వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాసుకు ఘన నివాళి



సాక్షి, నెట్‌వర్క్: విద్యతోనే కురుబల ప్రగతి సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రతి కురుబ తమ పిల్లలను ఉన్నత చదువు చదివించాలని తెలంగాణ రాష్ట్ర బడుగు బలహీన వర్గాలలో హర్షిషలు కృషి చేస్తున్న నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలో, కేటీదొడ్డి మండలంలోని చింతలకుంటలో, అయిజ మండల వ్యాప్తంగా, గట్టు మండలంలోని బల్గెర గ్రామంలో, ధరూరు మండల కేంద్రంతో పాటు నెట్టెంపాడు, మన్నాపురం, పారుచర్ల గ్రామాల్లో, వడ్డేపల్లి మండలంలో, మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లి, దాసరపల్లి, తాటికుంట, ఎల్కూరు గ్రామాల్లో కనకదాసు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు ఉరుకుందు, సంఘం నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సంకాపురం రాముడు, కేశవులు, యల్లప్ప, కరాటే శ్రీహరి, పల్లయ్య, బుచ్చన్న, సతీష్, గోవర్దన్, క్రాంతి, మనోజ్, ఈశ్వర్, ఈరన్న, తిరుమల్, అనిల్ పాల్గొన్నారు.

